క్లుప్తంగా

పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడుగా భవనం



వైఎస్ జగన్‌తో భవనం శ్రీనివాసరెడ్డి



బట్టు అనిల్ కుమార్

పర్చూరు (చిన్నగంజాం): రాష్ట్ర పంచాయతీ రాజు విభాగం ఉపాధ్యక్షుడిగా ఇంకొల్లు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనం శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన తోపాటు ఇంకొల్లు మండలానికి చెందిన బట్టు అనిల్ కుమార్ రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

నేటి నుంచి మండల స్థాయి సమావేశాలు

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల పరిధిలో ఆదివారం నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ మండల స్థాయి సమాయత్త సమావేశాలు నిర్వహించనున్నట్లు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఓ ప్రకటలనో తెలిపారు. ఆదివారం మార్టూరు మండలం, సోమవారం ఇంకొల్లు, బుధవారం చినగంజాం, గురువారం పర్చూరు, శుక్రవారం యద్దనపూడి, 12వ తేదీ కారంచేడు మండలాల్లో జరుగుతుందని ఆయన వివరించారు. సోమవారం ఇంకొల్లులోని కొణికి రోడ్డులోని కోదండ రామ ఫంక్షన్ హాలులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు చిన్ని పూర్ణారావు మరో ప్రకటనలో తెలిపారు. ఇంకొల్లు మండలానికి సంబంధించిన అనుబంధ విభాగం అధ్యక్షులు, మండల పార్టీ నాయకులు, వివిధ హోదాల్లోని ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

80 మందికి నోట్ పుస్తకాల అందజేత

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఎంపీయూపీ మోడల్ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు దాత చిమటా వెంకటేశ్వర్లు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పాఠశాల హెచ్ఎం పాలపర్తి నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి పర్చూరు పరిసర ప్రాంతాల్లోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ప్రతి సంవత్సరం పుస్తకాలు అందించి దాత వెంకటేశ్వర్లు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం హెచ్ఎం నాగమణితో పాటు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు బి. ప్రసాద్ బాబు, శివశాస్త్రి, విద్యార్థులు కరతాళ ధ్వనుల మధ్య దాతకు శాలువా కప్పి సత్కరించారు.

విద్యతో పాటు ఉద్యోగావకాశాలు



ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులకు చదువుతో పాటుగా ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని వీఆర్ఎస్ అండ్‌వైఆర్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవి కుమార్ తెలిపారు. శనివారం కళాశాలలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మెమొంటో, నగదు పురస్కారాలు అందించారు. డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ రాధాకుమారి, జీఎం దానయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేణుబాబుకు ఆర్థిక సాయం



వేణుకుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న దాతలు రవిచందర్, రత్నరాజు, నాయకులు

పర్చూరు(చినగంజాం): మాజీ సీఎం జగన్ హయాంలో వలంటీర్‌గా విధులు నిర్వహించి క్యాన్సర్ సోకి తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నాడు ఓ యువకుడు. ఈమేరకు పర్చూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన జగన్నాథం వేణు బాబుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయమందించారు. మార్టూరుకు చెందిన గర్నెపూడి రవిచంద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టారత్నం రాజు రూ. 10 వేలు ఆర్థిక సాయమందించారు. ఇంకొల్లులో జరిగిన నియోజక వర్గ స్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, ఎంఎల్‌సీ తూమాటి మాధవరావు, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి చేతుల మీదుగా వేణు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదంలో చిన్నారుల ఆరోగ్యం



నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పాఠశాల ముందే పేరుకుపోయిన మురుగు

- చిన అంబడిపూడి పాఠశాల ముందు పేరుకుపోతున్న మురగు
- నెల రోజుల నుంచి దుర్వాసనతో పాటు దోమలు
- నిరసన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

బల్లికురవ: విద్యార్థులుండే పాఠశాలల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండటంలేదు. అధికారుల ఉదాశీన వైఖరితో చిన్నారులకు ఎక్కడ రోగాలు వస్తాయోనని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు వెళ్లే దారిలోని డ్రైనేజీల్లో రెండు నెలలుగా మురుగు ముందుకు కదలడం లేదు. ఈ విషయాన్ని శనివారం స్థలదాత కోవూరి వెంకట కోటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీడీఓ కుసుమకుమారికి విన్నవించారు. చిన అంబడిపూడి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల్లో 45 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. ఇటీవల పాఠశాల ముందు ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సైడు కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో మురుగు పారుదల కావడంలేదు. దీనివల్ల పాఠశాలలోకి దుర్వాసనతో పాటు, దోమలు దాడిచే స్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పల్లపు పూర్ణయ్య, కోవూరి నాగరాజు, ప్రసన్న, పల్లపు వెంకటేశ్వర్లు, అనూష, తెలిపారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడీపీ రైతుల పంటలనే కొనుగోలు చేస్తారా?

- పొగాకు, ధాన్యం కొనుగోళ్లలో పక్షపాత వైఖరి
- పద్ధతి మార్చుకొని రైతులందరి పంటలు కొనుగోలు చేయాలి
- కారంచేడు మండల సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల ధ్వజం



పొగాకు కొనుగోళ్ల అక్రమాలపై ఏఓకి వివరిస్తున్న ఎంపీపీ వాసుబాబు

కారంచేడు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీ మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తమవుతున్న కొద్ది రోజుల్లోనే టీడీపీ నాయకుల అసలు బండారు బయట పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం టీడీపీ మద్దతుదారులైన రైతుల నుంచే పంటలు కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన పార్టీలకు చెందిన రైతుల పంటలను మాత్రం కొనుగోళ్ళలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు సభలో మాట్లాడారు. శనివారం ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పర్చూరు నియోజకవర్గంలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన మార్కెఫెడ్ అధికారులు టీడీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయారని పలువులు రైతులు వాపోతున్నట్లు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ధ్వజమెత్తారు. పొగాకు కొనుగోళ్ళ విషయంలో మార్కెఫెడ్ వద్ద టోకెన్ తీసుకున్న సామాన్య రైతులకు అధికారులు మొండిచేయి చూపుతూ, టీడీపీ నాయకుల ప్రసన్నం చేసుకున్న రైతులు ఆలస్యంగా టోకెన్ తీసుకున్నా వారి పంటలను మాత్రం ముందుగానే కొనుగోలు చేసి వారి ఖాతాల్లోకి నగదును కూడా జమ చేయడం చర్చనీయాంసమైందని పేర్కొన్నారు. టీడీపీకి వ్యతిరేకులైన అనేక మంది రైతులు నేటికీ మార్కెఫెడ్ ద్వారా అమ్మకాలు చేసుకోలేక తక్కువ రేటుకే బైట దళారులకు పంటలను అమ్ముకొనే దుస్థితి పర్చూరు నియోజకవర్గంలో జరుగుతుందనే విషయాన్ని పలువురు రైతులు తమ వద్ద వాపోతున్నట్లు వారు పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటికైనా స్పందించి పక్షపాత వైఖరి లేకుండా రైతులందరి నుంచి పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కారంచేడు మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని పోతినవారిపాలేనికి చెందిన టీడీపీ సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు వాపోయారు. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. అధికారుల అజమాయిషీ లేకపోవడంతోనే 20 మంది పనిచేస్తే 50 మందికి మస్టర్ వేసుకొని నిధులు డ్రా చేస్తున్నారని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. స్వర్ణ–దగ్గుబాడు ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితికి ఇప్పటికి కనీసం 20కి పైగా ప్రమాదాలు జరిగాయని, వెంటనే రోడ్డును వేయించాలని మండల కోఆప్షన్‌మెంబర్ నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. వడ్డెర కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు కిందగా ఉండటం వలన ఆ కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దగ్గుబాడు ఎంపీటీసీ కోరారు. సాగర్ ఆయకట్టు, కొమ్మమూరు ఆయకట్టు ద్వారా అందించే సాగునీటిని అవసరమైన మేర విడుదల చెయ్యాలని, లోలెవల్ వాటర్ రావడం వలన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వైస్ ఎంపీపీ సుబ్బారావు వాపోయారు. ఎంపీడీఓ కె. నేతాజీ, డాక్టర్ పృథ్వీరాజ్, ఇంకొల్లు సీడీపీఓ జి. సులోచనారాణి, ఎంఈఓలు సత్యన్నారాయణ, వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, ఏఈ ప్రసాద్, ఏఓ నాగరాజు, డీటీ శ్రీనివాసరావు, మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కేంద్రం పరిశీలన



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి

జె.పంగులూరు: పొగాకులో 20 శాతం లోపు తేమ ఉండే విధంగా చూసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పంగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రానికి రైతులు పొగాకు చెక్కులు తెచ్చే ముందు తప్పనిసరిగా గ్రేడింగు, తేమ శాత చెక్ చేసుకోవాలన్నారు. చెక్కులపై ఉన్న పంటల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకునేందుకు అవకాశం ఉందన్నారు. 20 శాతం లోపు తేమ ఉండే విధంగా చూసుకోని, చెక్కుల నుంచి పట్టలు చిరిగిపోకుండా మంచివి వేయాలని, పొగాకు గ్రేడ్ సక్రమంగా చేసుకొని ఏ గ్రేడ్‌కి ఆ గ్రేడ్ అంటే పై ఆకులు (హెచ్‌డీఆర్) మొదటి రకం, (హెచ్‌డీబీ) మధ్య ఆకులు రెండో రకం గ్రేడ్, కింది ఆకుల గ్రేడ్ (హెచ్‌డీయక్స్) మూడో రకం విడివిడిగా చెక్కులు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. రైతులకు మంచి రేటు రావడం, తిరిగి చెక్కులు వెన్నకి పంపకుండా వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం అధికారి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారిని, రైతులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మార్టూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆడకా గంగయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాలులో సాయంత్రం మూడు గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన అవసరం

మార్టూరు: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం కోసం మండల సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని ఎఫ్ఓఏపీ ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో శనివారం సాయంత్రం మండల సమైక్య ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సోలార్ పథకం ఏర్పాటు చేసుకోవడం కోసం లబ్ధిదారుకు రెండు లక్షల పదివేల రూపాయలు ఖర్చు అవుతుందని అందులో 78,000 ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ఆయన తెలిపారు. లబ్ధిదారు కేవలం 20000 రూపాయలు చెల్లిస్తే బ్యాంకులు లక్ష 12 వేల రూపాయలు రుణం మంజూరు చేస్తుందని వివరించారు. ఈ అవకాశం గురించి ప్రజల్లో ప్రచారం చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. మార్టూరు ఏపీఎం సురేంద్ర, సీసీలు అకౌంటెంట్ వీఏవోలు గ్రామ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మహత్య నిర్ణయం తప్పే

- వివాహిత ప్రాణాలు కాపాడిన ఎస్సై జనార్దన్



మహిళను కాపాడి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై జనార్దన్

వేటపాలెం: సమస్యలకు పరిష్కార మార్గం దొరకలేదని ఆత్మహత్యలకు పాల్పడటం సరైన నిర్ణయం కాదని ఎస్సై పి. జనార్దన్ పేర్కొన్నారు. శనివారం స్ట్రెయిట్ కాలువలోదూకి ఆత్మహత్యకి చేసుకోబోయిన వివాహితను సరైన సమయం లో అడ్డుకొని ప్రాణాలు కాపాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొణిజేటి నగర్ కాలనీకి చెందిన పొట్లూరి నందిని తన భర్త పొట్లూరి గణపతి మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అయితే తాను చేసిన అప్పులు తీర్చాలని కోరుతూ ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి భార్యను చిత్రహింసలు పెడుతున్నాడు. దీంతో విసిగిపోయిన భార్య పొట్లూరి నందిని ఆత్మహత్య చేసుకోవడానికి స్ట్రెయిట్ కాలవ దగ్గరకు వెళ్లింది. అయితే కాలనీ వాసుల సమాచారం మేరకు ఎస్సై సంఘటన స్థలికి వేగంగా చేరుకొని మహిళ అత్మహత్య చేసుకోకుండా రక్షించారు. ఆమె భర్తను పిలిపించి విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో ఆత్మహత్యలు ఎక్కువుతున్నాయని ..ఏ దైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి చెబితే పరిష్కరిస్తామని ఎస్సై వివరించారు.


కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే జాగ్రత్త

స్వర్ణ (కారంచేడు): మీ గ్రామాల్లో కొత్తగా వచ్చిన వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవహరించినా, సంచరించినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో పల్లె నిద్ర చేశారు. శనివారం వేకువజామున ఆయన గ్రామస్తులతో ముచ్చటించారు. దొంగలు ముందుగానే గ్రామాల్లో సంచరించి అన్ని పరిశీలించుకుంటారన్నారు. అలాంటి సమయంలోనే వారిని మనం గుర్తించాలని వివరించారు. అప్పుడే మన గ్రామాల్లో జరిగే దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. దేవాలయాలు, గుళ్ళు, మందిరాలను వారు టార్గెట్‌గా ఉంచుకుంటారన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

వేటపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం దేశాయిపేట, వేటపాలెం పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన లేబర్ కోడ్స్ రద్దు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేయడం, పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.21 వేలు చెల్లించాలన్నారు. జీఓ132, 142, 680 అమలు టెండర్ల పై హైకోర్టు తీర్పుల అమలు వంటి అంశాలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, కృష్ణ, కన్నయ్య పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఏకాదశి తిరునాళ్లు



గర్భగుడిలో స్వామివారు

జె.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు గ్రామంలో కొండపై ఉన్న బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఏకాదశి తిరునాళ్ల రామకూరు గ్రామంలో శనివారం కన్నుల పండుగగా జరిగాయి. తొలి ఏకాదశి తిరుణాల సందర్భంగా శనివారం గిరిప్రదక్షిణి చేసిన వారికి అల్పాహారం అందించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో దాదాపు రూ.4 కోట్లు వ్యయంతో ఆలయాన్ని ఆధునికీకరణ చేశారు.

బాలికలను కంటికి రెప్పలా చూసుకోవాలి

చీరాల రూరల్: తల్లి దండ్రులకు దూరంగా వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న బాలికలను కంటికి రెప్పలా చూసుకోవాలని మహిళా న్యాయవాది ఈశ్వరి రెడ్డి సూచించారు. శనివారం ప్రసాదనగర్‌లోని దెబోరా బాలికల వసతి గృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినిలకు ఎటువంటి లోటులేకుండా వారిని చూసుకోవాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. బాలికలను వేధింపులకు గురిచేసినా, లైంగికంగా హింసించినా పోక్సో కేసులు నమోదుచేసి జైలుకు పంపిస్తారని చెప్పారు. పీఎల్‌వీ సుభాని, వసతి గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగర కొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో శనివారం నృసింహుని కళ్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి శాంతి కళ్యాణ మహోత్సం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ స్వామి వారి కళ్యాణం వివాహ ఆరోగ్య సంతాన కుజ దోష సమస్యల నివారణకు ఈ కళ్యాణ క్రతువులో పాల్గొంటే దోష నివారణ జరుగుతాయని చెప్పారు. ప్రతినెలా స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున నిర్వహించనున్నట్లు చెప్పారు. దంపతులు రూ. 1116 చెల్లించి కళ్యాణంలో పాల్గొనవచ్చునని తెలిపారు. అనంతరం భక్తులందరికీ ప్రసాదం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలకు వితరణ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

అద్దంకి: ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐఐఈఏ) ఆవిర్భావ వేడుకల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఆధ్వర్యంలో చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులను, పుస్తకాలను, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమానికి డివిజనల్ జాయింట్ సెక్రటరీ రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావం సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అద్దంకి: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి పూర్ణచంద్రరవు మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పైసా పెంచమని.. స్మార్టు మీటర్లను తీసేస్తామని చెప్పలేదా అని ప్రశ్నించారు. బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించింది లోకేశ్ కాదా అన్నారు. ఇప్పుడు ప్రతి నెలా విద్యుత్ వినియోగదారుకు పలు రకాల చార్జీల పేరుతో నడ్డి విరుస్తున్నారని మండి పడ్డారు. తక్షణమే సర్దుబాటు చార్జీలు ఎత్తేయాలని, స్మార్ట్ మీటర్ల కోసం అదానితో కదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేఎల్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ఇదే విధంగా చార్జీలను కొనసాగిస్తే రాబోయో రోజుల్లో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థినికి బంగారు పతకం

- గవర్నర్ చేతుల మీదుగా పతకం అందుకున్న ఫర్జానా



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థిని

వేటపాలెం: సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో బీటెక్ విద్యార్థిని గోల్డ్‌మెండల్ సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు శనివారం తెలిపారు. శుక్రవారం కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలాజీల్ యూనివర్శిటీ 11వ స్నాతకోత్సవంలో విద్యార్థిని ఎస్‌కే ఫర్జానా.. గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుందన్నారు. విద్యార్థిని బీటెక్ పరీక్షల్లో ఇంటర్ నెట్ ఆఫ్ దింగ్స్‌లో యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రిన్సిపాల్ జగదీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థిని యూనివర్సిటీ పరిధిలోని 155 కళాశాల విద్యార్థులతో పోటీ పడి మొదటి ర్యాంకు ద్వారా బంగారు పతకం సాధించిందని తెలిపారు. హెచ్ఓడీ ఎస్. ఇంద్రనీల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు

చీరాల రూరల్: లోక్ అదాలత్‌లో సత్వరమే న్యాయ పరిష్కారం దొరుకుతుందని, లోక్ అదాలత్‌లలో ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు.

1631 కేసులు పరిష్కారం..

శనివారం కోర్టు భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు 1631 కేసులు పరిష్కరించారు. వాటిలో సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 1625, పీఎల్‌సీ కేసులు 68, మొత్తం 1631 కేసులను పరిష్కరించారు. ప్రిసైడింగ్ అధికారులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట వాహిని. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయని వ్యవహరించారు.

లోక్ అదాలత్‌లో 392 కేసుల పరిష్కారం

పర్చూరు(చినగంజాం): జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పర్చూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 392 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు సిబ్బంది చిరంజీవి తెలిపారు. అందులో సివిల్ కేసులు 17, క్రిమినల్ కేసులు 85, మనోవర్తి కేసు 1, పెట్టీ, న్యూసెన్స్ కేసులు 287, ప్రీ లిటిగేషన్ కేసులు 2 పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు పి. జాన్ బాబు, కె. సాల్‌మన్, సీహెచ్ శ్రీరమణి, కె. ధనలక్ష్మి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం అద్దంకి కోర్టు సముదాయాల్లో లోక్‌దాలత్ నిర్వహించారు. 1873 కేసులు పరిష్కారించారు. మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి డి నాగ వెంకట లక్ష్మి, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా న్యాయవాదులు ఆకుల సత్యవతి, షేక్ మహమ్మద్ రఫీ, వ్యవహరించారు. రెండో బెంచ్‌లో జూనియర్ సివిల్‌జడ్జి బి. అఖిల, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డి. హయగ్రీవచారి, మర్తా శ్రీను వ్యవహరించారు.